క్లుప్తంగా

నూతన పింఛన్ల పంపిణీ



వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ వరలక్ష్మి సీతారామయ్య, ఎంపీటీసీ అక్కయ్యమ్మ

పరవాడ: నాయుడుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన 16 వృద్ధాప్య, వితంతు పింఛన్లను సర్పంచ్ కె.వరలక్ష్మిసీతారామయ్య, ఎంపీటీసీ కూండ్రపు అక్కయ్యమ్మ మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కె.అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి పి.రమేష్, మాజీ ఉప సర్పంచ్ బండారు కృష్ణబాబు, వెన్నల రమాదేవి, రాజాన సత్యానారాయణ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి -ఇస్సన్నపేట గ్రామాల మధ్య పంచాయతీ రాజ్ నిధులు రూ.82.60 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ బుధవారం ఉదయం 9 గంటలకు శంకుస్థాపన చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీ పైల సన్యాసిరావు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమానికి పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

మర్యాద పూర్వక కలయిక

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో ఎస్. శ్రీనివాసమూర్తి సోమవారం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజును విజయనగరంలో మర్యాద పూర్వకంగా కలిశారు. స్వామివారి ప్రసాదం అందజేశారు. దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన విషయాలపై చర్చించారు. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈ హరి ఈవో వెంట ఉన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం



యజ్ఞోప వీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

గుంతలు పూడ్చాలని నిరసన

పరవాడ: స్థానిక సినిమాహాలు కూడలి సమీపంలోని పైడిమాంబ ఆలయం ఎదురుగా రహదారిపై ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యానారాయణ డిమాండ్ చేశారు. గుంతల కారణంగా ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు మధ్యలో నీరు నిలిచిపోవడంతో వాటిని గుర్తించలేక రాత్రి సమయంలో మరిన్ని ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలను వెంటనే పూడ్చడానికి చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

ఏకదంతాయ.. బహు రూపాయ

• విశేషంగా గణపతి పూజలు



సింహపురికాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడు



శ్రీనివాసనగర్‌లోని గణేష్‌కాలనీలో కరెన్సీనోట్ల అలంకరణలో గణనాథుడు



శ్రీనివాసా యూత్ ఫ్రెండ్స్ ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి వినాయకుడు



బృందావన్ కాలనీలో వినాయకుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్




గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అనంత పద్మనాభస్వామిగా గణనాథుడు



వెన్న అలంకరణలో వినాయకుడు



వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు



వేపగుంట జీకే కాలనీలో ఫ్రెండ్స్ ఫరెవర్ యూత్ ఏర్పాటు చేసిన వినాయకుడు

సింహాచలం: వినాయక చవితిని సింహాచలం దేవస్థానంతో పాటు పెందుర్తి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. విఘ్నాధిపతిని విభిన్న రూపాల్లో కొలువుదీర్చారు. పలు యువజన సంఘాలు, కాలనీల నిర్వాసిత సంఘాలు ఆకర్షణీయమైన మండపాలు ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

• సింహాచలం దేవస్థానం టోల్‌గేట్ వద్ద ఉన్న వినాయకుడి ఆలయంలో స్వామిని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేద పాఠశాలలో వినాయక చవితిని వేద విద్యార్థులు ఘనంగా నిర్వహించారు.

• అడవివరం గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అనంత పద్మనాభస్వామి ఆకారంలో భారీ వినాయకుడిని ఏర్పాటు చేశారు. గణేష్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

• శ్రీనివాసాయూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సంజీవిని తీసుకొస్తున్న ఆంజనేయస్వామి అలంకరణలో ఏర్పాటు చేసిన వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.

• పాత అడవివరం గౌరీ యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఊయల ఊగుతున్న బాలగణపతి విగ్రహం విశేషంగా ఆకట్టుకుంది.

• సింహపురి కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల విష్ణుమూర్తి, నడింపల్లి రామరాజు, కాలనీ నిర్వాసితులు, యూత్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

• సింహపురికాలనీలో చిన్నారులు ఏర్పాటు చేసిన శివుడు ఆకృతిలో వినాయకుడు విశేషంగా ఆకట్టుకుంది.

• 93వవార్డు శ్రీనివాసనగర్ దరి గణేష్‌కాలనీలో కరెన్సీ నోట్లుతో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం ఆకట్టుకుంది. కాలనీ అధ్యక్షుడు దేవపల్లి సత్యనారాయణ, కార్యదర్శి సూరిబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

• పెందుర్తిలోని ఉత్తరాంధ్ర శబరిమలై అయ్యప్ప స్వామి దేవాలయంలోని బెల్లం గణపతికి మంగళవారం వెన్నతో అలంకరణ చేశారు.

పరవాడ మండంలో..

పరవాడ: స్థానిక బొంకుల దిబ్బ ప్రాంతంలో బొంకుల దిబ్బ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిద్ధి వినాయకుడిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వైస్ సర్పంచ్ బి.రామారావు, ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ చల్లా కనకారావు, పార్టీ నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, బొద్దపు చిన్నారావు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

• సినిమాహాలు కూడలిలో ప్రతిష్ఠించిన వినాయకుడు భక్తులు నుంచి విశేష పూజలు అందుకున్నాడు. మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

• వెన్నలపాలెంలో నిలిపిన వినాయకుడికి సర్పంచ్ వెన్నల అప్పారావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. – నాయుడుపాలెం, వెంకటపతిపాలెం, ముత్యాలమ్మపాలెం, దీపాంజలినగర్, కలపాక, పి.బోనంగి, దేశపాత్రునిపాలెం, గొర్లివానిపాలెం, రావాడ, భర్నికం, తానాం, పెదముషిడివాడ, మడకపాలెం తదితర గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

• పరవాడ సిరపరపు వారి వీధిలో క్రేజీ బాయ్స్, బ్యాడ్ బ్యాయ్స్ ఆధ్వర్యంలో 'పర్యావరణ పరిరక్షణ-కాలుష్య నివారణ' నినాదంతో ఏర్పాటు చేసిన వినాయకుడిని వైఎస్సార్‌సీపీ నేతలు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

• పెందుర్తి బృందావన్ కాలనీలో నిర్వహించిన వినాయకచవితి ఉత్సవాల్లో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొర్లె రామునాయుడు, బృందావన్ కాలనీ అధ్యక్షుడు వై.రత్నశేఖర్, సెక్రటరీ బి.వి.నాగేశ్వరరావు, ట్రెజరర్ జి.వి.రమణ పాల్గొన్నారు.

• జీవీఎంసీ 93వ వార్డు నుంచి 98వ వార్డులోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఎమ్మెల్యే సందర్శించి పూజలు నిర్వహించారు.

• పెందుర్తి పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం విశేషంగా ఆకట్టుకుంది.

95వ వార్డులో...

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి ఎంపీపీ స్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చిప్పల చందు, నాయకులు యల్లపు పందేశినాయుడు, బొట్టా గోవింద్, వై.సత్యనారాయణ, వై.కృష్ణ పాల్గొన్నారు.



సిరపరపు వీధిలో ఏర్పాటు చేసిన వినూత్న వినాయకుడు



వెన్నలపాలెంలో పూజలు చేస్తున్న సర్పంచ్ వెన్నల అప్పారావు దంపతులు



బొంకులదిబ్బ వద్ద వినాయకుడిని దర్శించుకున్న నాయకులు, భక్తులు

80 అడుగుల రహదారి విస్తరణకు ప్రణాళికలు

• జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ
• జోన్-8లోని పలు ప్రాంతాల్లో పర్యటన



రహదారి ప్లాన్‌ను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ,అధికారులు

గోపాలపట్నం: వంటిల్లు వద్ద నుంచి గోపాలపట్నం కుమారికల్యాణ మండపం వరకు ఉన్న రహదారిని విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన రహదారి ప్రాంతంలో మంగళవారం పర్యటించారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారిని 80 అడుగుల రోడ్డు విస్తరణకు ప్లాన్ సిద్ధం చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. స్థానికంగా ఉన్న సమస్యలతో పాటు ఆక్రమణల వివరాలు సేకరించాలని సూచించారు. ప్రత్యేకంగా సుసర్ల కాలనీ నుంచి లక్ష్మీనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో విస్తరణ చేయాల్సి ఉందన్నారు. దీనిపై అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చామన్నారు. అనంతరం రత్నగిరి కాలనీ, చినముషిడివాడ, సుజాతానగర్ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. రత్నగిరి కాలనీ వద్ద థీమ్ పార్క్‌ను సందర్శించారు. పార్కులో మౌలిక సదుపాయాలు, వాకింగ్ ట్రాక్, గ్రీనరీ, లైటింగ్, తాగునీరు, వాచ్‌మెన్ గది మరుగుదొడ్లు వంటివి నిర్మించాలని ఆదేశించారు. సుజాతానగర్, చినముషిడివాడ ప్రాంతాల్లో పారిశుధ్యం సరిగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు జోనల్ కమిషనర్ మల్లయ్యానాయుడు, పర్యవేక్షక ఇంజినీర్ రామ్మోహనరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ రమణమూర్తి , ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ విజయ్ కుమార్, డీసీపీ పద్మజ, ఏసీపీ జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై మంగళవారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం 7గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో నృసింహ హోమం ఘనంగా నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చి హోమగుండం వద్ద అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమం విశేషంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ చేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆజలాలను భక్తులపై చల్లారు. దేవస్థానం తరపున ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు భరోసా



రావలమ్మపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ నారాయణమూర్తి

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి పంచాయతీ పరిధిలోని రావలమ్మపాలెంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో పేదలందరికీ ఆరోగ్య భరోసా కల్పించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 30 తేదీ వరకు వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎం లు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటిని సందర్శించి ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. మెరుగైన వైద్యం ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథరామకాసు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మండల జేసీఎస్ ఇన్‌చార్జి సబ్బవరపు ముత్యాలనాయుడు , ఉపసర్పంచ్ గొర్లి అప్పారావు, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడుబాబు, పంచాయతీ కార్యదర్శి రవి, కన్వీనర్ గొర్లి ఎర్రినాయుడు, వార్డ్ మెంబర్లు కోన శ్రీను, కొల్లి దాసు, మేడపరెడ్డి పైడితల్లి, సబ్బవరపు కృష్ణ, హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చురుగ్గా గృహ సారథుల బీమా నమోదు

సబ్బవరం: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదేశాల మేరకు గృహ సారథుల బీమా నమోదు కార్యక్రమం చురుగ్గా చేపడుతున్నారు. దీనిలో భాగంగా మంగళవారం మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో బోదువలస,అమృతపురం,సబ్బవరం-3,సబ్బవరం-4, వంగలి సచివాలయాల పరిధిలో గృహ సారథులకు బీమా సౌకర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, సచివాలయ కన్వీనర్లు కోన సంజీవరావు, సింగంపల్లి వరలక్ష్మి,బైలపూడి రామారావు, గొర్లి ఉమా మహేశ్వరరావు,సబ్బవరపు నాగభూషణం,సబ్బవరపు సత్యనారాయణ, మండల లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

• గజ ఈతగాళ్లకు సీఐ ఈశ్వరరావు సూచన



గజ ఈతగాళ్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఈశ్వరరావు

పరవాడ: ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీరప్రాంతాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం చేసే సమయంలో నిర్వాహకులు, గజ ఈతగాళ్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు సూచించారు. ముత్యాలమ్మపాలెం తీరంలో గజ ఈతగాళ్లకు మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాల వద్ద 11 రోజుల పాటు స్థానిక సర్పంచ్‌ల పర్యవేక్షణలో గజ ఈతగాళ్లను నియమించామని చెప్పారు. ఈతగాళ్లు ఉన్న సమయంలో తీరంలో గణేష్ నిమజ్జనాలు నిర్వహించాలన్నారు. నిమజ్జన సమయంలో నిర్వాహకులను లోతుగా ఉండే ప్రాంతాలకు అనుమతించవద్దన్నారు. చీకటి పడిన తర్వాత నిమజ్జన చేయడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటాయన్నారు. గజ ఈతగాళ్లు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఈశ్వరరావు సూచించారు. సమావేశంలో ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు, స్విమ్మర్లు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ



ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనాలు

సబ్బవరం: సబ్బవరం-చోడవరం రోడ్డులో గాలిభీమవరం జంక్షన్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. సబ్బవరంలోని సాయినగర్‌కు చెందిన గొర్లి కనకరాజు తాపీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం గాలిభీమవరంలో పని ముగించుకుని మధ్యాహ్నం భోజనానికి ద్విచక్రవాహనంపై సాయినగర్ వెళ్తున్నాడు.అదే సమయంలో నారపాడుకు చెందిన వాయిబోయిన లోవ సబ్బవరం నుంచి ద్విచక్రవాహనంపై ఎరువులు తీసుకుని వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో గాలిభీమవరం జంక్షన్ సమీపంలో రెండు వాహనాలు బలంగా ఢీకొన్నాయి. రెండు ద్విచక్రవాహనాలు నుజ్జు నుజ్జు కాగా ద్విచక్రవాహనం నడుపుతున్న లోవ,కనకరాజులకు గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సబ్బవరం పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందించారు.అయితే కనకరాజు పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు రిఫర్ చేశారు.కనకరాజు భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రంగనాథం తెలిపారు.

స్టీల్ ఏఐసీటీయూ ప్రధాన కార్యదర్శి కృష్ణారావు మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఏఐసీటీయూ ప్రధాన కార్యదర్శి నేతేటి కృష్ణారావు (57) మృతి చెందారు. ట్రాఫిక్ విభాగంలో జనరల్ ఫోర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణారావుకు గత నెలలో గుండెకు శస్త్రచికిత్స జరిగింది. అప్పటి నుంచి అనారోగ్యంగా ఉన్న కృష్ణారావు సోమవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయం తెలిసి ఏఐసీటీయూ అధ్యక్షుడు చిత్రాడ సన్యాసిరావు, సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు దొమ్మేటి సన్యాసి రావు ఆస్పత్రికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పురుగుల మందు తాగిన యువకుడి మృతి



తరుణ్ కుమార్ (ఫైల్)

సబ్బవరం: డిగ్రీ చదువుకున్నా ఉద్యోగం లేదనే మనస్తాపంతో పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం తిమిరాం గ్రామానికి చెందిన వాకాడ సన్యాసిరావు ఉపాధి కోసం గాజువాక వచ్చి కుటుంబ సభ్యులతో జీవనం సాగిస్తున్నాడు. సన్యాసిరావుకు డిగ్రీ పూర్తి చేసిన కుమారుడు తరుణ్ కుమార్(22) ఉన్నాడు. అతను కొంత కాలంగా ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఉద్యోగం దొరక్కపోవడంతో మానసికంగా ఆందోళన చెందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న సబ్బవరం బైక్‌పై వచ్చిన తరుణ్‌కుమార్ అసకపల్లిలో పురుగులమందు తాగాడు. అనంతరం బైక్‌పై వెళ్తూ దువ్వాడ సమీపంలోని నాగదేవత ఆలయం వద్ద స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతి చెందినట్లు సీఐ రంగనాథం తెలిపారు. మంగళవారం మృతుడి తండ్రి సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు నేటి నుంచి బైక్ యాత్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం నిర్వహించనున్న బైక్ యాత్రను జయప్రదం చేయాలని స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ కార్మిక నాయకులు కోరారు. మంగళవారం విభాగంలో జరిగిన కార్యక్రమంలో బైక్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో బైక్ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 20న నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం దరి దీక్ష శిబిరం వద్ద ప్రారంభమైన యాత్ర 29న కూర్మన్నపాలెం దీక్ష శిబిరానికి చేరనుందని తెలియజేశారు. ఆ రోజు నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు టి.వి.కె. రాజు, కనకరాజు, రమణాజీ, భాస్కరరావు, రామారావు, కొమ్ముప్రసాద్, సు బ్బారావు, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

950వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కార్మికులు చేస్తున్న ఉద్యమం వారి పోరాట శక్తికి నిదర్శనమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉద్యమంలో ప్రజలను భాగస్వాములను చేసి మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 950వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహనీయుల త్యాగఫలంగా ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం ఎలాంటి పోరాటానికైనా, ఆఖరికి ప్రాణత్యాగానికైనా సిద్ధమన్నారు.